సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పట్టా ఫౌండేషన్ మహా ప్రసాద వితరణ



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న పట్టా ఫౌండేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: నగరంలోని పలు దేవాలయాల్లో పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహా ప్రసాద వితరణ చేపట్టారు. రుషికొండలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కప్పరాడ ఎన్జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం, విశాలాక్షి నగర్‌లోని భక్త తుకారామాలయం, చినవాల్తేర్‌లోని జగన్నాథస్వామి ఆలయం, భానోజీనగర్‌లోని శ్రీరామసాయి మందిరంతో పాటు ప్రముఖ వైష్ణవ దేవాలయాల్లో ప్రసాదంతో పాటు భక్తులకు గోవింద నామావళి పుస్తకాలు అందజేశారు. పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్‌బాబు మాట్లాడుతూ మళ్ల మాధవ్ కామాక్షి, మోటూరు ప్రకాష్ పార్వతి సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాల అభివృద్ధికి విరాళం



ప్రిన్సిపాల్ విజయబాబుకు రూ.50వేలు చెక్కు అందిస్తున్న అధ్యాపకురాలు పద్మ

మద్దిలపాలెం: తను పని చేస్తున్న కళాశాల అభివృద్ధికి సహాయంగా రూ.50 వేలు విరాళం అందజేసి గొప్ప ఉదారత చాటుకున్నారు ఆ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పద్మ. వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.పద్మ.. కళాశాల అభివృద్ధికి రూ.50 వేల చెక్కును సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో భాగస్వామిని కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, స్టాఫ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు పి.వాణి, డాక్టర్ ఎ.ఎల్.రూపారాణి, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు అభినందనలు



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి(డీఎం అండ్ హెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావుకు సోమవారం పలువురు అభినందనలు తెలిపారు. ఆర్‌ఎంపీ రాష్ట్ర ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శి ఆనందరావు, గౌరవ సలహాదారుడు బాలసుందరం, మహిళా కార్యదర్శులు సూర్యకళ, అన్నపూర్ణ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానం చేశారు.

'స్పందన'కు 15 అర్జీలు

సీతమ్మధార: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ చేతన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం..
సర్వపాప హరణం

- వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు
- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ఇందిరానగర్‌లో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

ఆరిలోవ: ముక్కోటి ఏకాదశి పూజలతో భక్తజనం పులకించింది. ఉత్తర ద్వార దర్శనం కోసం సోమవారం ఉదయం నుంచి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఆరిలోవ ప్రాంతంలో వేంకటేశ్వరస్వామి, రామాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆరిలోవ టీఐసీ పాయింట్ సమీపం భరత్‌నగర్‌లో పద్మావతి సమేత అలివేలు మంగ వేంకటేశ్వరస్వామి, దుర్గాబజార్‌లో రామాలయం, కైలాసనగర్‌లో వేణుగోపాలస్వామి, ఇందిరానగర్ దరి రాజీవ్‌నగర్‌లో లక్ష్మీనారాయణస్వామి, విశాలాక్షినగర్‌లో రామాలయం, చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆయా ఆలయాల్లో భక్తులు వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను పూల తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. భరత్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఇందిరానగర్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మహిళలు కోలాటంతో అలరించారు.

వటపత్రసాయిగా వెంకన్న దర్శనం

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్టుకు వటపత్రసాయి అలంకరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత, రూ.100 దర్శనాల క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వారంలో స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను ప్రధానార్చకుడు బి.సూర్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డ్ చైర్‌పర్సన్ డి.పండరీభాయి, సభ్యులు రాచకొండ దశరథరామయ్య, బర్ల మంగరాజు, మండెం పద్మజ, గుడ్ల సత్యనారాయణ, కాగితాల ప్రసాదరెడ్డి పాల్గొన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతులు, 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, సురేష్ దంపతులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

- ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈస్ట్ షిర్డీ ఆలయంలో పెద్ద సంఖ్యలో దంపతులు హాజరై సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. సోమవారం, ఏకాదశి కలిసి రావడంతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి.

మద్దిలపాలెం: కేఆర్‌ఎం కాలనీలోని త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. మూడు కోట్ల దేవతలు భూమిపై సంచరించే ఏకైక పర్వదినం ముక్కోటి ఏకాదశి కావడంతో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హెచ్‌బీ కాలనీ, కొత్త వెంకోజీపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

- జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలోని షిర్డీ సాయి మందిరంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు చేశారు. స్వామివారిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు దంపతలు దర్శించుకున్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడ్ల సత్యారెడ్డి, కార్పొరేటర్ విజయసాయి ఘనంగా సత్కరించారు.



వటపత్రసాయి అలంకారంలో వేంకటేశ్వరస్వామి



భరత్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ దంపతులు



పెదవాల్తేరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలో పాల్గొన్న భక్తులు



ఈస్ట్ షిర్డీ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి



కేఆర్‌ఎం కాలనీలోని వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



మద్దిలపాలెంలో అక్కరమాని దంపతులను సత్కరిస్తున్న కార్పొరేటర్ విజయసాయి, సత్యారెడ్డి

అర్హులందరికీ పింఛన్ల మంజూరు

- టీడీపీ నాయకుల అసత్య ప్రచారం నమ్మొద్దు
- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల
- 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం




జోడుగుళ్లపాలెంలో ప్రజలకు పథకాల కరపత్రం అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. జోడుగుళ్లపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ స్వాతి, ఆ పార్టీ నాయకులతో కలసి గడపగడపకూ వెళ్లారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరాలతో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేసి, వాటి గురించి వివరించారు. ప్రతి ఇంటికి ఏయే పథకాలు అందుతున్నాయి?, ఎటువంటి లబ్ధి పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యల గురించి కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందిస్తుందన్నారు. పింఛన్లు తొలగించేస్తున్నారని టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. అర్హులైన వారికి ఈ నెల కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం మొదటి నెల పింఛన్ అందించారన్నారు. మత్స్యకారుల భరోసాపై మత్స్యకారులంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. పక్కాగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నవరస భరితం.. నృత్య రూపకం



నృత్యకారిణి యశస్విని సత్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల, అప్పారావు



నవరసాలను అలవోకగా పలికిస్తున్న నాట్యకళాకారుడు ఉదయశంకర్

మద్దిలపాలెం: నవరసాల సమ్మేళనంతో కూచిపూడి నృత్యరూపకం అందరినీ అబ్బురపరిచింది. దశావతారాలను ఒకే నాట్యంతో పాటు చక్కని హావభావాలను పలికించి ప్రేక్షకులను మైమరపించారు. పంచమ వేద నృత్యార్చనతోపాటు, అర్ధనారీశ్వరాంతర్యంను ఎంతో చక్కగా అభినయం చేసి అందరి హృదయాలను రంజింపజేశారు. శివపంచాక్షారిని, ఆనందతాండవమును నృత్యాతాండవంతో ఉర్రూతలూగించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సోమవారం అంబికేశ్వరి కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ 45వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వందేళ్లుగా తమ అకాడమీ నృత్యకారులను తయారు చేస్తోందని అకాడమీ అధ్యక్షుడు, నాట్య గురువు విజయ భరణిశంకర్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఏపీ ఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లా దుర్గారావు హాజరై కళాకారులను సత్కరించారు.

డ్వాక్రా బజార్‌లో రికార్డు స్థాయి విక్రయాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

- ఒక్కరోజులోనే రూ.52 లక్షల కొనుగోళ్లు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలభారత డ్వాక్రా బజార్ సరస్ 2022లో రికార్డు స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజులో రూ.52,31,044 విలువచేసే కొనుగోళ్లు జరిగాయి. దీంతో గత ఆరురోజుల్లో జరిగిన నమ్మకాలు రూ 1,55,40,451కి చేరుకున్నాయి. ఆదివారం సెలవు కావడంతో నగరం నలుమూలల నుంచిపెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వస్తువులు కొనుగోలు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు డ్వాక్రా బజార్ కొనసాగుతుంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఏడో రోజు కార్యక్రమాలలో భాగంగా స్నేహాంజలి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. మురిపాల గోపాల...అంటూ చిన్నారుల స్వాగత గీతంలో ప్రారంభమైన కార్యక్రమాలు వేయినామాలు....ముద్దుగారే ...,బ్రహ్మమొక్కటే తదితర శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. మేదిని, హారికల లిల్లీపుట్ నృత్యం కడుపుబ్బ నవ్వస్తూ అందరి మనసులను హత్తుకుంది. సంక్రాంతి సంబరాలు, థింసా నృత్యం మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచాయి. పెద్దసంఖ్యలో నగరవాసులు హాజరై కార్యక్రమాలను తిలకించారు.

సమాచారమ్

జర్నలిజం విభాగాధిపతిగా వినయ్‌కుమార్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సి.ఎం.వినయ్‌కుమార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతిగా డాక్టర్ సి.ఎం.వినయ్‌కుమార్ నియమితులయ్యారు. సోమవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం ఆయన విభాగంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌ను విభాగ ఆచార్యులు డి.వి.ఆర్.మూర్తి, సిహెచ్.రామకృష్ణ, టి.విజయలక్ష్మి, విభాగ పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

ఏబీ బర్ధన్‌కు ఘన నివాళి



ఏబీ బర్ధన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

అల్లిపురం: దివంగత సీపీఐ నేత ఏబీ బర్ధన్ 7వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో నగర కార్యదర్శి మరుపల్లి పైడిరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో సీపీఐ నేతలు ఎస్.కె.రెహ్మాన్, ఎం.మన్మథరావు, ఎ.ఆదినారాయణ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొని బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేటి తరం నాయకులకు, కార్యకర్తలకు బర్ధన్ స్ఫూర్తి అని వక్తలు కొనియాడారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: గత నెల డిసెంబర్ 31వ తేదీ రాత్రి డీఆర్‌ఎం కార్యాలయం వద్ద కారు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయి. చామన ఛాయ కలిగి, నలుపు, తెలుపు గెడ్డంతో ఉన్నాడని, ఎరుపు రంగు స్వెట్టర్, బూడిద రంగు హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు, సిమెంట్ రంగు ప్యాంటు ధరించాడని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04716, 94407 40864 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బోనం గోవిందరాజుకు ఘనంగా సత్కారం



ఏపీ లైవ్‌స్టాక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజును సత్కరిస్తున్న మేయర్ గొలగాని

ఆరిలోవ: ఏపీ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన బోనం గోవిందరాజును సోమవారం ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ 9వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధ్వర్యంలో విశాలాక్షినగర్ గీతాంజలి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకలతో కలిసి ఆయనను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా గొలగాని, అక్కరమాని మాట్లాడుతూ విశాలాక్షినగర్‌కు చెందిన గోవిందరాజు జిల్లాలో పశు సంవర్ధక శాఖలో పనిచేస్తూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, సత్తి నాగేశ్వరరెడ్డి, బోనం శ్రీనివాస్, రుద్రరాజు రమేష్, కళావతి, మోహన్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరావు, బీమారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల్లో సేవా భావం అవసరం



మహిళా ప్రాంగణం సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఆరిలోవ: ఆశా కార్యకర్తలు సేవా భావంతో పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పైనాపిల్ కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన ప్రాంతాల ఆశా కార్యకర్తలకు ఇక్కడ 10 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆశా కార్యకర్తల వైద్య సేవలు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఇక్కడ శిక్షణ ద్వారా పొందిన అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మాతా శిశు సంక్షేమ శాఖ వైద్య సేవలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా 9న నిర్వహిస్తున్న పీఎంఎస్ఎంఏ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమలాకుమారి, డాక్టర్ బి.ఉమావతి, డీపీహెచ్‌ఎన్‌వో సత్యవతి, హెచ్‌ఈఈవో మణికుమారి, డీసీఎం లక్ష్మి, హెచ్‌ఈ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

సూత్రా ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



సందర్శకులతో ఎగ్జిబిషన్

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులోని నొవోటల్ వద్ద ఏర్పాటు చేసిన సూత్రా ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. సోమవారం ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌లో దేశం నలుమూలల నుంచి ప్రసిద్ధి చెందిన వస్త్రాలను ప్రదర్శించారు. సంప్రదాయ వస్త్రాలతో పాటు నేటి తరం యువతకు ఆకర్షించే దుస్తులు అందుబాటులో ఉండడంతో విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన ఫ్యాషన్ వస్త్రాలతో 40 స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ మంగళవారం రాత్రి 8 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికుల హక్కులకు గండి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉక్కు నిర్వాసితుల హక్కులకు గండి కొడుతూ పరిశ్రమను ప్రైవేట్ పరం చేసేందుకు పావులు కదుపుతున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 690వ రోజు సోమవారం ఆగ్రోఫారెస్ట్, సేఫ్టీ, ఎస్.ఎస్.డి, ఎఫ్.ఎం.డి విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర తదితరులు మాట్లాడారు. 30 ఏళ్లుగా కార్మికులు ఆహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, నదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు.

బీసీ జనగణన చేపట్టాలని వినతి

అల్లిపురం: బీసీ జన గణన జరిగేలా కేంద్రప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ ఏపీ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సభ్యులు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఆయన్ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల్లోనూ రిజర్వేషన్ కల్పించడం, బీసీలకు క్రీమిలేయర్ తొలగించడం తదితర అంశాలపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించేలా చూడాలని కోరారు. జీవీఎల్ మాట్లాడుతూ బీసీ జన గణన రాష్ట్రాల వారీగా జరిగితే త్వరితగతిన పూర్తవుతుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్‌తో చర్చిస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం సభ్యులు కోటా రమేష్, కె.రామ్‌కుమార్, కొయ్య రామకృష్ణ, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్లారావు, సీనియర్ బీసీ సంఘం నాయకుడు కర్రి రాము తదితరులున్నారు.